ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5 కనిష్ఠం 23.4
కామారెడ్డి జిల్లా వార్తలు
5
సోమవారం 1 జులై 2024



కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జూన్ 30: మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు.



బాన్సువాడలో అద్దె భవనంలో కొనసాగుతున్న డీఎస్పీ కార్యాలయం

అద్దె భవనాలే దిక్కు!

- జిల్లాలో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- పాలనలో ఎదురవుతున్న అసౌకర్యం
- అద్దె భవనాలకు అద్దె బకాయిలు కట్టలేని పరిస్థితి
- సొంత భవనాలకు నోచుకుని డివిజన్, మండల కార్యాలయాలు
- ఇతర ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న తహసీల్, ఎంపీడీవో, పోలీసుస్టేషన్ కార్యాలయాలు
- గ్రామ పంచాయతీలకు సైతం సొంత భవనాలు కరువు
- అరకొర వసతుల మధ్యే అధికారుల విధులు
- ఇప్పటికీ స్థల సేకరణ చేయని పరిస్థితి

కామారెడ్డి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పాలన సౌలభ్యం కోసం కొత్త రెవెన్యూ డివిజన్‌లు, మండలాలు ఏర్పాటు చేసి 9 ఏళ్ల గడుస్తున్నా సొంత భవనాలకు కనీసం స్థలాలు కూడా చూడడం లేదు. కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయాలు తప్ప డివిజన్, మండలాల కార్యాలయాల నిర్మాణాలకు ప్రస్తావనే లేదు. నాలుగేళ్ల కిందట పల్లె ప్రగతి కోసం రైతు వేదికలు, ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులకు శరవేగంగా స్థల సేకరణతో పాటు నిర్మాణాలు సైతం పూర్తి చేశారు. కానీ కొత్త డివిజన్‌లు, మండలాలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా సొంత భవనాలు లేకపోవడంతో కొన్ని అద్దె భవనాలలో, మరికొన్ని ఇతర శాఖలకు చెందిన భవనాలలో పాలన కొనసాగిస్తున్నారు. ఈ అద్దె భవనాల సైతం అధికారులు అరకొర వసతులతోనే వెళ్లదీస్తున్నారు. అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు.




నస్రుల్లాబాద్ ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

డివిజన్ కార్యాలయాలు సైతం అద్దె భవనాల్లోనే..

గత 9 ఏళ్ల కిందట కామారెడ్డి జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంతో పాటు కొత్త ఎల్లారెడ్డి, బాన్సువాడ రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేశారు. అలాగే బీబీపేట, రాజంపేట, రామారెడ్డి, నస్రూల్లాబాద్, పెద్దకొడప్‌గల్ మండలాలు ఏర్పాటు అయ్యాయి. వీటితో పాటు ఇటీవల కొత్తగా మరో మూడు మండలాలైన డోంగ్లి, పల్వంచ, మహ్మద్‌నగర్‌లను ఏర్పాటుచేశారు. పంచాయ తీల విభజనలో పలు తండాలు కొత్త పంచాయతీలుగా ఆవిర్భవించాయి. అయితే పరిపాలన కేంద్రీకరణ జరిగి 9 ఏళ్లు అవుతున్నా సౌకర్యాలు మాత్రం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దీంతో అసౌకర్యాల మధ్యే పాలన కొనసాగుతోంది. అధికారులు, సిబ్బంది కూర్చోవడానికి కూడా సరైన సౌకర్యాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాన్సువాడలో డీఎస్పీ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. నీటి పారుదలశాఖ ఎస్ఈ కార్యాలయం అద్దె భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. డివిజన్ స్థాయి ఇతర శాఖల కార్యాలయాలు కూడా అరకొర సౌకర్యాలు ఉన్న భవనాల్లోనే ఉన్నాయి. ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఐకేపీ భవనంలోనే ఉంది. ఎక్సైజ్ కార్యాలయాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయలం చాలీచాలని పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే పాలకులు, అధికారులు వెల్లదీస్తున్నారు. ఇతర శాఖల కార్యాలయాలవి ఇదే పరిస్థితి.



ఎల్లారెడ్డిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎక్సైజ్‌శాఖ కార్యాలయం




పాత గ్రామ పంచాయతీ భవనంలో కొనసాగుతున్న ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం

కొత్త మండలాలకు పూర్తిస్థాయి కార్యాలయాలు ఎప్పుడో?

పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం 9 ఏళ్ల కిందట కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. వీటితో పాటు తండాలకు సైతం కొత్త గ్రామ పంచాయతీలుగా ప్రకటించింది. అయితే ఈ కొత్త మండలాలకు, గ్రామ పంచాయతీలకు సైతం పూర్తిస్థాయి సొంత కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేయ లేకపోతోంది. జిల్లాలోని రాజంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పీహెచ్‌సీ పాత భవనంలో నిర్వహిస్తున్నారు. పోలీసుస్టేషన్ పాత సహకార కార్యాలయంలో, ఐకేపీ కార్యాలయం అద్దె భవనంలో, ఎంఈవో కార్యాలయం ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతున్నాయి. రామారెడ్డి మండల పరిషత్ కార్యాలయాన్ని ఎంఈవో కార్యాలయ భవనంలో, తహసీల్దార్ కార్యాలయాన్ని సొసైటీలో, పోలీస్ స్టేషన్‌ను పాత పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్నారు. పెద్దకొడప్‌గల్ మండల పరిషత్ కార్యాలయాన్ని విద్యాశాఖ భవనంలో నిర్వహిస్తున్నారు. పోలీసుస్టేషన్ పశువుల ఆసుపత్రి భవనంలో, తహసీల్దార్ కార్యాలయం పాత పంచాయతీ భవనంలో నడుస్తున్నాయి. ఎంఈవో కార్యాలయం కార్యకలాపాలు ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్నాయి. నస్రూల్లాబాద్ మండల కార్యాలయం సొసైటీ భవనంలో, పోలీసు స్టేషన్ పీహెచ్‌సీ భవనంలో, పీహెచ్‌సీని రైతువేదికలో, ఎంపీడీవో కార్యాలయాన్ని గ్రంథాలయంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో వందల సంఖ్యలోనే కొత్త పంచాయతీలకు ఏర్పాటు చేశారు. ఈ గ్రామ పంచాయతీలను సైతం సొంత భవనాలు లేక శిథిలావస్థకు చేరిన భవనాలలో, రేకుల షెడ్లుల్లో, అద్దె భవనాల్లో పంచాయతీల పాలన కొనసాగిస్తున్నారు.

ఇప్పటికీ గుర్తించని స్థలాలు

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన రెవెన్యూ డివిజన్‌లు, మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి సంబంధించి అడుగు కూడా ముందుకు పడడం లేదు. కొత్త జిల్లాగా ఏర్పడినప్పటికీ కేవలం కొత్త కలెక్టరేట్, ఎస్పీ సమీకృత భవనాలు మాత్రమే నిర్మించారు. ఇక కొత్త డివిజన్ మండలాలు, గ్రామ పంచాయతీల పరిస్థితి అంతంత మాత్రమే. వీటికి ఇప్పటి వరకు కనీసం స్థలాలను కూడా గుర్తించలేదు. దీంతో ఆయా కార్యాలయాలు అరకొర వసతులు ఉన్న భవనంలోనే నడుస్తున్నాయి. సొంత భవనాల నిర్మాణంపై సర్కారు దృష్టి సారించాలని ప్రజలతో పాటు ఆయా సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.



కామారెడ్డి పట్టణ ముఖచిత్రం

అశ్రునయనాలతో..
డీఎస్ అంతిమ యాత్ర

- హాజరైన సీఎం, ముఖ్యనేతలు
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు
- జనసంద్రమైన నగరం

నిజామాబాద్ అర్బన్, జూన్ 30: జన హృదయ నేత, మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్‌కు ప్రజలు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో గల ఆయన వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన పెద్ద కుమారుడు ధర్మపురి సంజయ్ అంతిమ సంస్కారాలను నిర్వహించగా ఆయన రెండవ కుమారుడు, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ సైతం పాల్గొన్నారు. అంతకుముందు ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసంలో ఉంచిన డి.శ్రీనివాస్ పార్థివదేహానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్ర డీఎస్ నివాసం నుంచి ఎల్లమ్మగుట్ట చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేకమాన్, కంఠేశ్వర్ మీదుగా బైపాస్ రోడ్డులోని వ్యవసాయ క్షేత్రం వరకు సాగింది. అంతిమయాత్రలో డీఎస్ అభిమానులు, శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బీజేపీ శ్రేణులు, ప్రజలు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. సుమారు 3 గంటల పాటు అంతిమయాత్ర సాగింది. అంతిమ సంస్కారాలకు ముందు ప్రభుత్వ లాంఛనాలతో పోలీసులు నివాళులర్పించారు. గాలిలోకి కాల్పులు జరిపి శ్రద్ధాంజలి ఘటించారు. అంతిమయాత్రలో ముఖ్యనేతలు మధుయాష్కి, సుదర్శన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, జీవన్‌రెడ్డి, మాజీ మంత్రులు మండవ, నేరేళ్ల ఆంజనేయులు, మాజీ ఎంపీలు వి.హన్మంత్‌రావు, లగడపాటి రాజగోపాల్, మర్రి శశిధర్‌రెడ్డి, ఈటల రాజేందర్, వివేక్, తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, కేశవేణు, అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, ఈరవత్రి అనిల్, ఏనుగు రవీందర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, బిగాల గణేష్‌గుప్త, సీపీఐ, సీపీఎం నాయకులు రమేష్‌బాబు, నూర్జహాన్, పెద్దివెంకట్రాములు, సుధాకర్, కంజర భూమయ్య, వి.ప్రభాకర్ తదితరులు డీఎస్‌కు ఆయన నివాసంలో నివాళులర్పించారు.



నిజామాబాద్‌లో డీఎస్ ఇంటి వద్ద మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న సంజయ్



డీఎస్ అంతిమయాత్రలో పాల్గొన్న అభిమానులు

కామారెడ్డిలో కుడా ఏర్పాటయ్యేనా?

- పట్టణ డెవలప్‌మెంట్ పరిధిలోకి 7 గ్రామాలు
- 65.08 చ.కి.మీలుగా విస్తరించిన పట్టణ పరిధి
- కుడా ఏర్పాటుతో టౌన్ ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి
- ప్రతిపాదనలు తయారు చేసి ఎనిమిదేళ్లు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కదలిక వచ్చేనా?

కామారెడ్డి టౌన్, జూన్ 30: కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడడంతో కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)ని ఏర్పాటు చేసేందుకు 8 ఏళ్ల క్రితం మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. అయినా ఇంతవరకు కుడా ఊసేలేదు. కామారెడ్డి మున్సిపల్‌కు 5 కి.మీ నుంచి 7 కి.మీ దూరంలో ఉన్న 7 గ్రామాలను కలుపుతూ కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. లక్షకు పైగా జనాభా ఉన్న కామారెడ్డి మున్సిపల్ గతంలో 17 చదరపు కి.మీ విస్తరించి ఉండగా 7 గ్రామాలు సైతం కుడా పరిధిలోకి రావడంతో జనాభా దాదాపు 2లక్షల వరకు పెరిగింది. విలీన గ్రామాలతో మున్సిపల్ పరిధి సైతం 65.08 చదరపు కి.మీ.లకు విస్తరించింది. ఈ మేరకు అప్పటి కలెక్టర్ సత్యనారాయణ 2016 అక్టోబరులో కుడా ఏర్పాటుకు గత ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ ఎలాంటి ముందడగు పడలేదు. 8 ఏళ్లుగా కుడా ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇప్పటికీ ఆదేశాలు రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఫురటిలోనే మగ్గుతోంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో కుడా ఏర్పాటుకు కదలిక వచ్చేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎనిమిదేళ్ల కింద అథారిటీకి ప్రతిపాదనలు

కామారెడ్డి జిల్లా కేంద్రం కావడంతో ఎనిమిదేళ్ల కాలంలో పట్టణాభివృద్ధి వేగవంతంగా జరుగుతోంది. కామారెడ్డి మున్సిపల్ 17 చదరపు కి.మీ. విస్తరించి ఉండగా టేక్రియల్, అడ్లూర్, పాత రాజంపేట్, రామేశ్వర్‌పల్లి, దేవునిపల్లి, లింగాపూర్, సరంపల్లి గ్రామాలు కామారెడ్డి పట్టణంలో విలీనం చేయడంతో మున్సిపల్ పరిధి విస్తరించి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. వివిధ కట్టడాల కోసం, గృహ సముదాయాల కోసం, వాణిజ్య సముదాయాల కోసం పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. పట్టణంలో టౌన్ ప్లానింగ్ నిబంధనలు అమలు జరగకపోగా, పక్కనే ఉన్న గ్రామాల్లో రియల్టర్లు వెంచర్లు పెడుతూ వ్యాపారం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

కామారెడ్డి పట్టణం చుట్టూ 5 కి.మీ నుంచి 7 కి.మీ లోపల ఉన్న గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేసి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా ఏర్పాటు చేయాలంటూ 2016లో అప్పటి కలెక్టర్ సత్యనారాయణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి లేఖ పంపారు. అయితే ఆ తర్వాత కొన్నాళ్ల పాటు దీనిపై సుదీర్ఘంగా చర్చ సాగినప్పటికీ ఫైల్ పెండింగ్‌లో ఉంటూ వచ్చింది. జిల్లా కేంద్రంను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా మార్చాలంటూ ఎన్నో వినతిపత్రాలు అందజేశారు. అయినా ఎక్కడా అడుగు ముందుకు పడలేదు. మున్సిపల్‌లో విలీనమైన పలు గ్రామాలతో పాటు ఆయా వార్డులలో నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. వాటిలో చాలా చోట్ల నిబంధనలు పాటించడం లేదని కొందరు కౌన్సిలర్‌ల ఒత్తిడితో అధికారులు సైతం వెనకడుగు వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొన్నిచోట్ల సెల్లర్‌లలో నిర్మాణాలు చేపట్టడం, సెట్‌బ్యాక్ విడిచిపెట్టకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. కుడా ఏర్పాటు జరిగితే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉండనుంది.

కుడా ఏర్పాటుకు ముందడుగా పడేనా?

జిల్లా కేంద్రమైన కామారెడ్డిలో 5 కి.మీ నుంచి 7 కి.మీ దూరంలో ఉన్న గ్రామాలను కలిపి కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చేర్చి కుడా కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు ఎలాంటి ముందడుగు పడలేదు. ప్రస్తుత పాలకవర్గ సమయం సైతం మరో 6 నెలల్లో ముగియనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ఏర్పడడంతో ఈ ప్రభుత్వంలోనైన కదిలిక వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా కుడా ఏర్పాటుపై ప్రభుత్వ సలహాహారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రస్తుతం ఉన్న పాలకవర్గం, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌లు చొరవ తీసుకొని హైదరాబాద్ పంపించిన కుడా ఫైల్ ఎంత వరకు వచ్చిందనే దానిపై దృష్టి సారిస్తే కుడా ఏర్పాటు త్వరగా అయ్యే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

- రాష్ట్ర బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డి



మెల్లకుంట తండాలో మొక్కలు నాటుతున్న పైడి ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట, జూన్ 30: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర బీజేపీ నేత, ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మండలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, మండలంలోని మెల్లకుండా తండాలో ఆయన మండల బీజేపీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను నరికేయడం వల్ల చెట్లు తగ్గిపోవడంతో కాలుష్య వాతావరణం ఏర్పడిందని, ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు అధికమయ్యాయని, వర్షాకాలంలో తగిన వర్షాలు కురవడం లేదన్నారు. అధిక వర్షాలు కురిసేందుకు, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడం కోసం తమ వంతుగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో తాను స్వచ్ఛందంగా త్వరలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, ఎల్లారెడ్డి మాజీ సర్పంచ్ దేవేందర్, బీజేపీ నాయకులు వెంకయ్య, హన్మాండ్లు, దేవీసింగ్, ఆకుల కిష్టయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు



రోడ్డు పక్కన సెఫ్టీవాల్



అంకాపూర్ శివారులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

ఆర్మూర్‌రూరల్, జూన్30: ఆర్మూర్ ప్రాంతంలోని వివిధ గ్రామాలలో మూలమలుపులు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి నుంచి అంకాపూర్ వెళ్లే మార్గంలో ఉన్న మూలమలుపులతో అజాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇస్సాపల్లి వైపు నుంచి రైతులు తాము పండించే పంటలను అంకాపూర్ మార్కెట్‌కు ఇదే రోడ్డు గుండ తీసుకువెళ్తుంటారు. ఇదీ సమీపదారి కావడంతో తరచు ఈ మార్గం గుండానే ప్రయాణం చేస్తుంటారు. అంతేగాకుండా తమ గ్రామశివారులోని వ్యవసాయ క్షేత్రాలకు నిత్యం వెళ్తుంటారు. రెండు గ్రామాల మధ్య తారురోడ్డు కొత్తగా వేసినప్పటికీ మూల మలుపులను సరి చేయకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. వీటికి తోడు రోడ్లకు ఇరువైపులా చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకుండా పోయే అవకాశం ఉంది. అదే విధంగా ఈ దారి వెంబడి రోడ్ల పక్కన వ్యవసాయ బావులు సైతం ఉన్నాయి. బావుల వద్ద చిన్నపాటి సూచికబోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. అలాగే కొంత మేర రోడ్డు దిగువన ఉండడంతో వర్షాకాలంలో గుత్పనీరు విడుదల చేసే సమయంలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. మూలమలుపులు ఉన్న చోట ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయిస్తే ప్రజలను ప్రమాదబారి నుంచి కాపాడినవారవుతారు. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చోట సెఫ్టీవాల్స్ ఏర్పాటు చేస్తే ప్రజలకు రక్షణగా ఉంటుంది. దీంతో పాటు మండలంలోని చేపూర్,లక్కోర గ్రామాల్లో శివారులోని జాతీయరహదారిపై సైతం మూలమలుపు వద్ద తరచుప్రమాదాలు జరుగుతుంటాయి. ఆర్మూర్ నుంచి పిప్రికి వెళ్లే మార్గంలో ప్రభుత్వ కళాశాల మూలమలుపు ప్రమాద కరంగా తయారైంది. ఈ స్థలంలో గతంలో పలుమార్లు ప్రమాదాలు జరి గాయి.

● సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

రోడ్ల మూలమలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయిస్తే ప్రమాదాలు జరుగకుండా కొంత మేరకైన నివారించవచ్చు. ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయని గుర్తు చేస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీని ద్వారా వాహనదారులు వాహ నాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటారు.

స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలి



ఇస్సాపల్లి - అంకాపూర్ గ్రామాల మధ్య మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగి పలువురు గాయాల బారినపడ్డారు. సంబంధిత అధికారులు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలి. అదే విధంగా కొన్ని చోట్ల సెఫ్టీవాల్స్ నిర్మిస్తే ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలి.

- తంబురి శ్రీనివాస్, ఇస్సాపల్లి

మోతెలో పరిష్కారమైన భూ వివాదం

- నాలుగేళ్లుగా రగులుతున్న సమస్య
- దళిత కుటుంబానికి దక్కిన న్యాయం



మోతెలో పరిష్కారమైన స్థలం ఇదే

వేల్పూర్, జూన్30: మండలం మోతె గ్రామంలో సుమారు నాలు గేళ్లగా రగులుతున్న భూవివాదం ఇటీవల ఎట్టకేలకు పరిష్కరమైంది. దీంతో భూమి కోసం పోరాడుతున్న దళిత కుటుంబం, రెవెన్యూ, పోలీసు విభాగాలు, గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తితే మో తె గ్రామంలోని రాజరాజేశ్వర దేవాలయం భూమి పక్కన సర్వేనెంబర్ 333లో ఎకరం 20గుంటల భూమి 1962నుంచి ఇస్సాపల్లి గంగారాం, ఇస్సాపల్లి నడ్పి గంగారాం అనే వ్యక్తుల పేర్లపై రికార్డుల్లో నమోదై ఉంది. అప్పట్లో ఈ భూమిని ఇస్సాపల్లి గంగారాం, రాజరాజేశ్వరస్వామికి ఇచ్చారని, దేవాలయానికి ఇచ్చిన భూమిపై ఎవరు అబద్ధం ఆడరు అనే నమ్మకంతో పేరు మార్పించి చేయించలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. మాతాత ఆ భూమిని దేవాలయానికి ఇవ్వలేదని, రికార్డు ప్రకారం భూమి తమదేనని ఇస్సాపల్లి గంగారాం మనవడు ఇస్సాపల్లి రవి గ్రామస్థులకు తెలిపారు. దీంతో గ్రామస్థులు భూమికి, ఏర్పాటు చేసిన పెన్సింగ్‌ను నాలుగు సార్లు తొలగించి హద్దురాళ్లను పగులగొట్టారు. అడ్డుకోబోయిన రవి కుటుంబ సభ్యులపై గ్రామస్థులు దాడి చేశారు. రవి కుటుంబానికి సాంఘీక బహి ష్కరణ విధించారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి భూమి ఇస్సాపల్లి గంగారాం వారసులకు చెందుతుందని తెల్చిచెప్పారు. అయినప్ప టికీ గ్రామస్థులు ఆ భూమి దేవాలయానిదేనని పట్టుబట్టారు. గ్రామస్థులు చేసిన దాడిపై ఇస్సాపల్లి రవి 2003లో ఎస్పీకి అట్రాసిటి కేసు నమోదు చేశారు. గత ఏడాది సీపీగా బాధ్యతలు చేపట్టిన కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పి ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసులు సైతం గ్రామస్థులకు చాలా సార్లు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్టా ప్రకారం ఇస్సాపల్లి గంగారాంకు చెందిన ఎకరం 20గుంటల భూమి వారి వారసులకే చెందుతుందని గ్రామస్థులకు ఎటువంటి హక్కులేదని, దానిపై ఏటువంటి అజామాయిషి చేసిన కేసులు నమోదు అవుతాయని నచ్చజెప్పారు. అయినప్పటికీ గ్రామస్థులు గత బుధవారం తిరిగి దాడి చేసి ఇస్సాపల్లి గంగారాం భూమికి పాతిన సరిహద్దులను పెన్సింగ్‌ను తొలగించి వేశారు. ఈ విషయాన్ని గంగారాం కుటుంబీకులకు వేల్పూర్ పోలీసులు తెలపడంతో పోలీసులు మోతె గ్రామస్థులను పిలిపించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నందుకు రిమాండ్‌కు చెల్లాల్సిందేనని స్పష్టం చేశారు. దాంతో గ్రామస్థులు తమ నిర్ణయాన్ని మార్చుకొని ఇక నుంచి ఆ భూమి జోలికి వెళ్లబోమని గంగారాం కుటుంబీకులకు రాతపూర్వకంగా రాసిచ్చారు. గంగారాం కుటుంబీకులు సైతం దేవాలయానికి తమవంతుగా 24గుంటల భూమిని విరాళంగా రాసిచ్చారు. దీంతో గత నాలుగేళ్లుగా రగులుతున్న భూ వివాదం పరిష్కా రం కావడంతో ఇటు అధికారులు, అటు గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రమాదకరంగా ఉన్న గుంత పూడ్చాలి



గుంతపు చూపుతున్న దృశ్యం

కోటగిరి,జూన్30:కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని సీపీఎం కార్యదర్శి నన్నేసాబ్ డిమాండ్ చేశారు. కోటగిరి మైనారిటీ పాఠశాల ప్రాంగణంలో గుంతను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7కోట్ల వ్యయంతో పాఠశాల నిర్మించినప్పటికి గుంత పూడ్చకపోవడం సరికాదన్నారు. పాఠశాలలో 350మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. మైదానం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం గుంతను పూడ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులున్నారు.

ఆర్మూర్‌లో ఘనంగా ఊరపండుగ

ఆర్మూర్‌రూరల్, జూన్30: ఆర్మూర్ పట్టణంలో సర్వసమాజ్, ఆరు పంతల ఆధ్వర్యంలో ఆదివారం ఊరపండగను ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని వివిధ ఆలయాల్లో గ్రామదేవతలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పడిపంటలతో విలజిల్లాలని, ప్రజలందరికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వ సమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, కోశాధికారులు గుండెటి మహేష్, చిట్టి శ్రీనివాస్, సభ్యులు దోమకొండ రాజు, గోపాల్, నల్ల లింగన్న, సిద్ధపురం లింగన్న, వివిధ సంఘాల పెద్దమనుషులు పాల్గొన్నారు.

బోధన్ వాసికి మహానంది జాతీయ పురస్కారం

బోధన్‌రూరల్,జూన్30: తెలుగు, వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవ సమితి ఆధ్వర్యంలో మాజీ భారత ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహానంది జాతీయ పురస్కారాలలో బోధన్ మండలం ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కుర్రోళ్ల లక్ష్మి జానపద రంగంలో చేస్తున్న విశిష్టమైన సేవలకు తెలుగు, వెలుగు మహనంది జాతీయ పురస్కారం అందుకున్నారని స్వచ్ఛంద సేవ సంస్థ జాతీయ చైర్మన్ పాలోజి రాజ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో కుర్రోళ్ల లక్ష్మికి మహనంది జాతీయ పురస్కారాన్ని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

జిల్లా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడికి పలువురి పరామర్శ

ఏర్గట్ల, జూన్ 30: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ చిన్న తండ్రి శివన్నోల్ల శంకర్ ఇటీవలే మృతి చెందగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, పెద్దిరెడ్డి రవి, మాజీ ఎంపిటీసిలు గడ్డం లింగారెడ్డి, సున్నపు అంజయ్య, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, సుంకేట రవిలు పాల్గొన్నారు.

వర్నిలో భారీ వర్షం

వర్ని,జూన్30: వర్ని, చందూర్ మండలాల పరిధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా సుమారు రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ సాయిలు తెలిపారు. నిజాంసాగర్ నీటి విడుదలతో పాటు భారీ వర్షం కురవడంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పంట పొలాలు జలమయం అయ్యాయి.

బోధన్‌లో ఘనంగా బోనాల పండుగ

బోధన్‌రూరల్,జూన్30: బోధన్‌లో ఆదివారం మున్నూరు కాపు, యాదవ సంఘం, తదితర కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల నుండి ఊరేగింపుగా బోనాలతో మహిళలు మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. డప్పుచప్పుళ్ల వాయిద్యాల మధ్య బోనాలను సమర్పించారు. అమ్మవారికి ఓడి బియ్యం నింపి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు బీర్కూర్ బుజ్జి, గాండ్ల తేలికుల సంఘం అధ్యక్షులు నాగేశ్వర్ రావు, హన్మాండ్లు, శివయ్య, సురేష్, టీచర్ సాయిలు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

నవీపేట,జూన్30: మండలంలోని జన్నేపల్లికి చెందిన సుద్దపల్లి చందన్న(47)అనే వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. నందిపేట మండలం సిద్దాపూర్‌కు చెందిన చందన్న గత కొన్ని సంవత్సరాలుగా తన కుటుంబ సభ్యులతో కలిసి జన్నేపల్లిలో నివాసం ఉంటూ చేపలు పడుతూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సమస్యలతో భార్యభర్తల మధ్య గొడవ జరుగగా తెల్లవారుజామున అతడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య గంగామణి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా చందన్న మృతిపై తమకు అనుమానం ఉందని మృతుడికి వరుసకు సోదరుడు అయ్యే సాయిలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఒంటిపై ఎటువంటి గాయలు లేవని ఎస్ఐ పేర్కొన్నారు.

రుద్రూరులో శునకాల బెడద

- ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్న శునకాలు
- శునకాల బెడదను వెంటనే అరికట్టాలి
- వృద్ధులు, పిల్లలు, మహిళలపై శునకాల దాడులు
- పట్టించుకోని పాలక వర్గం


రోడ్డుపై సంచరిస్తున్న శునకాలు (ఫైల్)


వీధుల్లో సంచరిస్తున్న శునకాలు (ఫైల్)

రుద్రూరు, జూన్ 30: మనుషులతో అత్యం త సన్నిహితంగా మెలిగే జంతువులలో శునకాలు ముఖ్యమైనవి. ఇతరపెంపుడు జంతువుల కంటే కుక్కల ద్వారా మనుషులకు వచ్చే వ్యాధులు ఎక్కువ. పిచ్చి కుక్కలు, వీధి కుక్కల ద్వారానే గాక పెంపు కుక్కల ద్వారా కూడా వ్యాధులు వ్యాపించే ప్రమాదం చోటు చేసుకుంటున్నాయి. కుక్కకాటు వల్ల రేబీస్ అనే వ్యాధి వస్తుందనే విషయం తెలిసిందే. కుక్కలోని లాలాజలంలో ఉండే రేబిస్ క్రిముల వల్ల రేబిస్ వ్యాధి సోకు తుంది. నిత్యం ఏదో ఒక చోట పశువులు, మ నుషులపై, వాహనదారులపై, మహిళలు, చిన్నా రులపై దాడులు జరుగుతున్న సంఘటనల్లో గా యాలు కావడం, చనిపో వడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రుద్రూరు మండల కేంద్రంలోని పలు వీధులలో శునకాల బెడద రోజురోజుకు పెరిగి పోతోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ము ఖ్యంగా రుద్రూరు కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ, జవహర్‌నగర్ కాలనీ, కుమ్మరి వీధి, కర్రోళ్ల వీధి, అంగడి బజార్ తదితర పలు వీధులలో శునకాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అంబేద్కర్ కాలనీ, జవహర్‌నగర్ కాలనీలలో నడిరోడ్డుపై, పలు వీధులలో శునకాలు గుంపుల గుంపులుగా తిరుగుతూ సంచరిస్తున్నాయి. దీంతో మహిళలు, చిన్నారులు, స్థానిక వాసులు బయటకు వెళ్లాలంటే శునకాలు ఎప్పుడు దాడి చేస్తాయో తెలియక భయభ్రాంతులకు గురవుతు న్నారు. బోధన్- బాన్సువాడకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ప్రధాన రహదారి గుండా వేలాది వాహనాలు వెళుతుంటాయి. అటుగా వెళు తున్న ద్విచక్ర వాహనదారులపై, పాదాచారులపై శునకాలు దాడి చేస్తున్నాయని స్థానికులు, మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డుపై వెళుతున్న పలు వాహనాలను, ద్విచక్ర వాహన దారులను శునకాలు వెంబడిస్తూ ఇబ్బం దులకు గురి చేస్తున్నాయన్నారు. ఈక్రమంలో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదా లకు గురై గాయాలపాలైన సంఘటనలు ఎన్నో చో టు చేసుకుంటున్నాయి. అంతేగాక రోడ్డుపై వివిధ పనుల నిమిత్తం నడుచుకుంటూ వెళుతున్న మహి ళలపై, పెద్దలపై, చిన్నారులపై సైతం దాడి చేస్తున్నాయని స్థానికులు పేర్కొం టున్నారు. ముఖ్యంగా ఉదయం,రాత్రి వేళల్లో శునకాలు వాహనదారులను, పాదాచా రులను వెంబడిస్తున్నాయని స్థానిక వాసులు తెలియజేస్తున్నారు. వెంటనే సంబంధిత అధి కారులు చర్యలు తీసుకుని శునకాల బెడద అరికట్టాలని ప్రజలు, కాలనీల వాసులు కోరుతున్నారు.

శునకాల బెడదను అరికట్టాలి



శునకాల వల్ల స్థానికులు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్లే వారిని వెంబడిస్తూ దాడికి పాల్పడుతున్నాయి. రాత్రివేళల్లో, ఉదయం పూట వాహన దారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వెంటనే శునకాల బెడదను అరికట్టాలి.

- పి.కిరణ్, అంగడి బజార్, రుద్రూరు

ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి



జవహర్‌నగర్‌లో బాన్సువాడ - బోధన్ వెళ్లే ప్రధాన రహదారి కావడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి. ఆ క్రమంలో వాహన దారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయాలపాలవు తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసు కోవాలి.

-నవీన్, జవహర్‌నగర్ కాలనీ, రుద్రూరు

సబ్ స్టేషన్‌లో మరమ్మతులు


సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూన్30: శనివారంరాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి బోధన్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌పార్మర్‌లు మరమ్మత్తులు చేపట్టినట్లు ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ తెలిపారు. వర్షానికి ట్రాన్స్‌పార్మర్లు మరమ్మతులకు వస్తున్నాయన్నారు. అప్పుడప్పులు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడం కోసం ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. రైతులకు, ప్రజలకు విద్యుత్ సమస్యలు ఎదురైతే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

డబుల్ బెడ్ ఇళ్లు అందజేయాలని ఆందోళన


కందకుర్తిలో ఆందోళన చేస్తున్న ప్రజలు

రెంజల్,జూన్30: అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించిన నేటి వరకు మండలంలోని కందకుర్తి గ్రామంలో లబ్ధిదారులకు అందించడం లేదంటూ ఆదివారం గ్రామస్తులు డబుల్ బెడ్ రూమ్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎవరికి వారుగా ఇళ్లలోకి చొరబడడంతో గుర్తించిన పంచాయతీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి ఎస్‌ఐ సాయన్న డబుల్ బెడ్ రూమ్‌ల వద్దకు వచ్చి ప్రజలకు నచ్చజెప్పడంతో గ్రామస్థులు వెనుదిరిగారు. తమకు ఏళ్ల నుండి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి నేటి వరకు ఇవ్వకపోవడంతో నివాస గృహలు లేక ఇబ్బందులు పడుతున్న అధికారులు, ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్ రూమ్‌లను పంపిణీ చేసి లబ్ధిదారులను ఆదుకోవాలన్నారు.

ఏర్గట్లలో ధర్మపురి శ్రీనివాస్‌కు నివాళి


ఏర్గట్లలో శ్రీనివాస్ నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, జూన్ 30: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రివర్యులు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, కురాకుల భూమన్న, బద్దం లింగారెడ్డి, ముస్కు మోహన్, పన్నాల నర్సారెడ్డి, గడ్డం జీవన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్గుల్‌లో ఘనంగా తాతాయి పండుగ

జక్రాన్‌పల్లి, జూన్ 30: వర్షాలు కురిసి పంటలు పండాలని మండలంలోని అర్గుల్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తాతయి పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామస్థులు, భక్తులు తాతయి ఆలయానికి చేరుకున్నాయి. అనంతరం ఆలయంలో తాతయికి భక్తులు, గ్రామస్థులు నైవేద్యాలు వేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్థులు వనభోజనాలకు వెళ్ళారు. ఈ కార్యక్ర మంలో అర్గుల్ వీడీసీచైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి బాస్కర్‌రెడ్డి, వీడీసీభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

జక్రాన్‌పల్లి, జూన్ 30: మండలంలోని అర్గుల్ గ్రామంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం రెండు లారీలు ఢీకొనగా ఒక లారీ డ్రైవర్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న రెండు లారీలు వెనుక నుంచి వచ్చి మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.

మద్యం సిండికేట్ దందా

- స్టిక్కర్ల బెల్టు షాపులకు సరఫరా
- ఒక్కో మద్యం బాటిల్, బీరుపై రూ.20 దౌర్జన్యపు వసూళ్లు
- గ్రామ కమిటీలు, ఎక్సైజ్ సిబ్బంది చేతివాటం

వర్ని,జూన్30: బోధన్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని వర్ని ఉమ్మడి మండలంలో మద్యం మాఫియా కొత్త పుంతలు తొక్కుతోంది. ధనార్జనే ధ్యేయంగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి గ్రామాల్లో పుట్ట గొడుగుల్లా బెల్టు షాపులు ఏర్పడటానికి కారణం అవుతున్నారు. ఏ షాపు పరిధిలో గల బెల్టు షాపుకు ఆ షాపు స్టిక్కర్ ముద్రణ వేస్తూ గ్రామాలకు పెద్ద మొత్తంలో మద్యం సరఫరా యదేచ్ఛగా కొనసాగుతోంది. వ్యాపారులు ఎక్సైజ్ అధికారులను మచ్చిక చేసుకుని దందా కొనసాగిస్తుండగా బెల్టు షాపు నిర్వాహకులు గ్రామ కమిటీలకు ఏడాదికి ఒక్కో బెల్టు షాపుకు రూ.25వేల నుంచి రూ.1.50లక్షల వరకు డిమాండ్ పద్దతిలో చెల్లిస్తున్నారు. వర్ని, రుద్రూర్, చందూర్, మోస్రా మండలాల పరిధిలో సుమారు 90వరకు బెల్టు షాపులు ఉండగా 20వరకు దాబాలు కొనసాగుతున్నాయి. దాబా నిర్వాహకులు మద్యం ఎమ్మార్పీపై రూ.30అదనపు వసూళ్లు చేస్తుండగా సిట్టింగ్, మటన్, చికెన్, భోజనం వంటకాలతో ఒక్కో మద్యం ప్రియుడిపై రూ.750 వరకు దండుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ఇక బెల్టు షాపుల్లో ఒక్కో క్వాటర్, బీరు సీసాపై రూ.20వరకు సొమ్ము చేసుకుంటున్నారు. విచ్చల విడిగా బెల్టు షాపుల వల్ల నిత్యం గ్రామాల్లో దొంగతనాలు, విచ్చలవిడి జూదం, హత్యలు, అత్యాచారాల సంఖ్య పెరిగిపోతోంది. యువత మద్యానికి బానిసై చెడు అలవాట్లకు గురవుతున్న సందర్భాలు ఉన్నాయి. నేరాల సంఖ్య పెరగడంతో వాటి నియంత్రణలో ఎక్సైజ్ శాఖదే బాధ్యతగా పేర్కొంటూ పోలీసులు చేతులెత్తేస్తున్న సందర్భాలు కోకొల్లలు. మద్యం మహమ్మారి వల్ల గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తీవ్రం అవుతున్న ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, గ్రామ కమిటీల సహకారం మరింత అనర్థాలకు దారి తీస్తోంది అనడంతో సందేహం లేదు.


హత్యకు గురైన నారాయణ(ఫైల్)

ఎక్సైజ్ వారి పేరు చెప్పుకుంటే కటకటాలే: బోధన్ ఎక్సైజ్ సీఐ

గ్రామాలు, మండల కేంద్రాల్లో విచ్చలవిడి బెల్టు షాపులు, దాబాలు పెరగడంపై బోధన్ ఎక్సైజ్ సీఐ పవన్ గౌడ్‌ను వివరణ కోరగా ఆయన ఘాటుగా స్పందించారు. మద్యం వ్యాపారుల సిండికేట్ గ్రామ కమిటీల వారి బెల్టు షాపు నిర్వాహకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడం, జూదం, హత్యలు, అత్యాచారాలు దొంగతనాల సంఖ్య పెరగడంలో ఎక్సైజ్ శాఖపై ఆరోపణలు వస్తున్నాయి అని ప్రశ్నించగా తనకెలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇక నుంచి బోధన్ డివిజన్ పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా పెంచి దాడులు నిర్వహిస్తామని తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకులు, దాబా నిర్వాహకులు తమ శాఖ పేరు చెప్పి అక్రమ దందాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కటకటాల పాలు చేస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం అమ్మకాలపై తమకు సమాచారం ఇవ్వాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ కోరారు.

దండోరా రజతోత్సవ వేడుకలు విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,జూన్30: దండోరా రజతోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ అన్నారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోర రజతోత్సవ వేడుకల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావించి 30సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జులై 7వ తేదిన హైదరాబాద్ రవీంద్ర భారతిలో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హజరుకానున్నారన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ఎమ్మార్పీఎస్ మాదిగ, మాదిగ ఉప కులాల హజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు లింబూరి లక్ష్మణ్, మందర్నా నాగురావు,తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్ సొసైటీ మహాజన సభలో రసాభాస

ఆర్మూర్‌రూరల్, జూన్30: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ ఆవరణలో ఆదివారం జరిగిన మహాజన సభ రసభసగా మారింది. మహాజన సభలో పలువురు రైతులు ఎరువులు సకాలంలో ఇవ్వడంలేదని సొసైటీ చైర్మన్ పెంట బోజారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఇతర గ్రామాలకు వెళ్ళి ఎరువులు తీసుకురావాల్సిన అవసరం ఉందని వారన్నారు. ఇందుకు కారణమైన సొసైటీ చైర్మన్, డైరెక్టర్‌లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెర్కిట్ సొసైటీ వల్ల రైతులకు ఏలాంటి లాభం లేదని, పాలకవర్గ సభ్యులు మాత్రం లబ్దిపొందుతున్నారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్‌లకు రైతుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. సొసైటీలో అవినీతి రాజ్యమేలుతుందని చైర్మన్, డైరెక్టర్‌లు రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని వారో ఆరోపించారు. డైరెక్టర్‌లు, రైతులు ఒకరినోకరు దుషించే స్థాయికి వెల్లగా అధికారులు కలగజే ుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. అనంతరం ప్రత్యేక అధికారి శ్రీరాం మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బంధు పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని, సొసైటీల నుంచి సేకరించిన అభిప్రాయాలను చేసిన తీర్మాణాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, రైతు బంధు ఇవ్వవద్దవని, ఐదు ఎకరాల లోపు రైతులకు మాత్రమే రైతు బంధు అందజేయాలని రైతులు అభిప్రాయపడ్డారు. పంటలు పండించే రైతులకు మాత్రమే రైతు బంధు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్, రైతులు పాల్గొన్నారు.


పెర్కిట్‌లో సొసైటీ డైరెక్టర్‌లు, రైతుల మధ్య వాగ్వాదం

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు


మొక్కలను నాటుతున్న బీజేపీ అధ్యక్షుడు

రుద్రూరు, జూన్ 30 : రాష్ట్ర శాఖ పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం భారతీయ జనతా పార్టీ రుద్రూరు మండల శాఖ ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ స్థాపకులు బీజేపీ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఏక్‌పెడ్-మా కానామ్-అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు. కార్యకర్తలు తమ తమ గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేప ట్టారు. రుద్రూరు మండలంలోని సిద్దాపూర్ గ్రా మంలో తన ఇంటి ఆవరణలో బీజేపీ అధ్య క్షు డు అలపాటి హరికృష్ణ మొక్కలను నాటారు.

● మోదీ మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ మండల అధ్యక్షుడు

రుద్రూరు మండల బీజేపీ అధ్యక్షులు అలపాటి హరికృష్ణ ఆదివారం తన స్వగృహం లో ప్రధానిమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడిన మన్‌కీ బాత్ కార్యక్రమం తిరిగి ప్రారంభించడం సంతోషకరమని అన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

● మహిళకు తీవ్ర గాయాలు

బోధన్‌రూరల్,జూన్30: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధ్యాకం గల్లీకి చెందిన లక్ష్మి అనే మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి మహిళను ఢీకొట్టి వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు. ఆమె రెండు కాళ్లపై నుండి ద్విచక్ర వాహనం వెళ్లడంతో తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

సుంకెట్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం


గ్రామదేవతలకు గోదావరి జలాలతో జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మోర్తాడ్, జూన్30: మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామంలో వర్షాలు కురిసిన చెరువుల నిండాలని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఉదయం గోదావరి నది నుంచి తెచ్చిన జలాలతో వలగొడుగుతో మహిళల బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని దేవత మూర్తులకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు గ్రామస్థులను అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సందీప్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ఉప్లూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో వలగొడుగు ఉత్సవం

కమ్మర్‌పల్లి: మండంలోని ఉప్లూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వలగోడుగు ఉత్సావాన్ని ఘనంగానిర్వహించారు. పవిత్ర గోదావరి నుంచి గంగాజాలను తెచ్చి స్థానిక బాలరాజరాజేశ్వరస్వామి ఆలయ నుంచి వలగొడుగు ఊరేగింపు నిర్వహించారు.వర్షాలు కురవాలని అంతసుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గ్రామదేవతలకు డప్పువాయిద్యాలతో వెల్లి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు సోమ దశరత్, సభ్యులు చింత కుంట శ్రీనివాస్, కొమ్ముల రవీందర్, బద్దం రమేష్, నరేందర్ తదతర కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు గ్రామ గంగపుత్ర సంఘాల స భ్యులు పాల్గొన్నారు.

● మెండోరలో గ్రామదేవతలకు జలాభిషేకం

మెండోర: వానమ్మ వానమ్మ ఒక్కసారైనా వచ్చి పోవమ్మా అంటూ.. మండలంలో గ్రామప్రజలు పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నది నుంచి కాలినడకన వెళ్లి డప్పువాయిద్యాలతో వలగొడుగు, మహిళల మంగళహారతులతో, శివ సత్తుల పునాకలు, పోతారాజుల విన్యాసాలతో గంగజలాలను తీసుకువచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు.

● ఘనంగా పస్కారాజుల పండగ

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని ఆయా గ్రామాల్లో పస్కారాజుల పండగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదావరి తీరం నుంచి గంగజలాలను తీసుకువచ్చి వలగొడుగులు, డప్పువాయిద్యాలు, మహిళ మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్ళి ఆలయాల్లో పూజలు నిర్వహించి దేవతమూర్తులకు జలా భిషేకం చేశారు. వర్షాలు సమృద్దిగా కురిసి పంటలు పండాలని, ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు.ఈకార్యక్ర మంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

● ఆలూర్‌లో...

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం దేవతమూర్తులకు జలాభిషేకం నిర్వహిం చారు. గోదావరి తీరం నుంచి గంగజలాలను తీసుకువచ్చి వలగొడుగులు, డప్పువాయిద్యాలు, మహిళ మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లో పూజలు నిర్వహించి దేవతమూర్తులకు జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీసభ్యులు గంగాధర్, మధు, శేఖర్, వినోద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వసమ్మేళనంలో ఉప్లూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి, జూన్ 30:మండలంలో ఉప్లూర్‌ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 విద్యాసంవత్సర పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 16 సంవత్సరాల తరువాత ఒక చోట కలుసుకుని గెట్టుగెదరు కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగులుగా స్థిరపడిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు ఆదివారం ఒక చోట కలుసుకున్నవీరు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ తమతమ యోగక్షేమాలు, ప్రస్తుత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువలు, జ్ఞాపికలతో సన్మానించుకుని వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. అంతకు ముందు తాము చదివిన పాఠశాలకు వెళ్లి తరగతగదిలో కూర్చొని విద్యార్థి దశలో చేసిన తీపిగుర్తులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందడోలికల్లో మునిగి తేలారు. పూర్వ విద్యార్థి అపూర్వ సమ్మేళనంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఉపాధ్యాయులు శంకర్‌గౌడ్, వేణుగోపాల్ శర్మ, విజయ్‌కుమార్, ఊట్నూర్ గంగాధర్, శిరిమల్ల దేవన్న,మంద శ్రీనివాస్, ఆదిత్య, సంధ్యారాణి, పూర్వవిద్యార్థినులు విద్యార్థులు తమతమ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు.

బోధన్‌లో వర్షం.. రైతన్నల హర్షం

బోధన్‌రూరల్,జూన్30: బోధన్‌లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు పంట పొలాల పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరు చేరుకుంటుంది. చిన్నపాటిగా కురుస్తున్న వర్షాలకు రైతన్న హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ వర్షాల తమ పంట పొలాలకు మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. పొలం పనులు జోరందుకొనున్నాయి.

అనుమానాస్పదంగా ఒకరి మృతి


రవికుమార్ (ఫైల్)

ఆర్మూర్‌టౌన్,జూన్30: పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో బండ రవికుమార్ (37)అనే వ్యక్తిఅనుమా నాస్పదంగా మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలి పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం రాత్రి బంధు మిత్రులతో కలిసి మద్యం సేవించాడని తెలిసింది. ఆదివారం ఉదయం ఓషాప్ వద్ద రవి కుమార్ అనుమానాస్పదంగా మృతి చెందడంతో స్థానికులు,కుటుంబస భ్యులు అయోమయానికి గురయ్యారు. దీంతో మృతుని భార్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.సంఘటన స్థలాన్నిపోలీసులు పరిశీలించి మృతదేహాన్నిపోస్టు మార్టం ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మృతునికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

గుంతల మయంగా రోడ్డు


భీమ్‌గల్ నుంచి బెజ్జోరకు వెళ్లే బైపాస్ రోడ్డు దుస్థితి

భీమ్‌గల్ రూరల్, జూన్30: చిన్నపాటి వర్షానికే రోడ్లన్ని చిత్తడవుతున్నాయి. గుంతమయం అయిన రోడ్లతో జనాలు నానాఅవస్థలు పడుతున్నారు. ఇందుకు ఉదహరణే భీమ్‌గల్ నుంచి బెజ్జోర గ్రామానికి వెళ్లే ప్రధాన బైపాస్ రహదారి దుస్థితి. నిత్యం ఈ బైపాస్ రోడ్డు వెంబడి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు వందల సంఖ్యలో తిరుగుతాయి. ఈ తారురోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలమయం కావడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటి వరకు గుంతలు పడ్డ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టక పోవడంతో వర్షపు నీరు నిలిచి రాత్రిళ్లు వాహనాలు వెళితే ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్ బి శాఖ అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయబావుల వద్ద కేబుల్ వైర్ల చోరీ

గాంధారి,జూన్30:గాంధారి మం డల కేంద్రంలో గత నెలరోజులను ంచి తరచుగా రైతులబోరు బావుల వద్ద కేబుల్‌వైర్లను దొంగలు అంది నకాడికి దోచుకుని వెళ్తున్నారు. దీం తో రైతులు ఏమి చేయాలో అర్థం కాకతలలు పట్టుకుంటున్నారు. శని వారం,ఆదివారం రెండురోజులలోనే పదులసంఖ్యలో బోరుమోటార్స్ వద్ద కేబుల్ వైర్లను కటింగ్ చేసుకుంటూ ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు ఎవరికిచెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. కేబుల్ దొంగలిస్తే వచ్చే లాభం ఎంతో తెలియదు కాని రైతులకు మాత్రం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే ఖర్చులు పెరిగి వ్యవసాయం చే యడానికి నానా అవస్థలు పడుతున్న రైతులకు ఈ చోరీలతో మరింత తల నొప్పిగా మారింది. ఇప్పటికైనా దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై పోలీ సులు నిఘా ఉంచి కఠినచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సేవా సప్తహ



మొక్కలను నాటుతున్న నాయకులు

కామారెడ్డిటౌన్, జూన్ 30:విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సేవా సప్తహా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక సరస్వతి శిశుమందిర్, శ్రీకృష్ణమందిరం ప్రాంగణంలో మొక్కలు నా టారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ జిల్లాఉపాధ్యాక్షుడు గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజు, జిల్లాసేవ ప్రముఖ్ అజయ్, జిల్లా ప్రచారప్రముఖ్ శ్రీకాంత్‌రావు,బజరంగ్‌దళ్ జిల్లాసంయోజక్ మంచాలరాజు,వీహెచ్‌పీ పట్టణ కార్యదర్శి వంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలను నాటుతున్న దృశ్యం

నసురుల్లాబాద్, జూన్ 30: భారతీయ జనతా పార్టీ నసురుల్లాబాద్ మం డలశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రశాఖ పార్టీ ఆదేశాల మేర కు ఆదివారం భార తీయ జన్‌సంఘ్ స్థాప కులు బీజేపీ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా నసురు ల్లాబాద్ కేంద్రంలో ఏక్‌పేడ్- మాకా నామ్- అమ్మ పేరిట ఒక మొక్క అనే కార్యక్రమం చేపట్టారు.ఈసందర్భంగా బీజేపీ బాన్సు వాడ అసెంబ్లీ కన్వీనర్ జి.శ్రీనివాస్ శక్తి కేం ద్రం ఇన్‌చార్జిలకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్క కార్యకర్తలు, సీనియర్ నా యకులు పదాధికారులు మండలంలోని ప్రతీఒక్క బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు సీనియర్ నాయ కులు అందరూ తమతమ గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్ట డం జరి గింద న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సున్నం సాయిలు, ఓబీసీ జిల్లా నాయకులు వడ్ల సతీష్, ప్రధాన కార్యదర్శి మేకల రామన్న, నాయకులు దుర్గం సంజు, శక్తి కేంద్రం ఇంచార్జి సాయిలు, బూత్ అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతి చెందిన సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి, జూన్ 30 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డి మండలంలోని జంగమాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగమాయిపల్లి గ్రామానికి చెందిన హనుమయ్య (62) అనే రైతు ఆదివారం మధ్యాహ్నం పొలం వద్ద నారుకు నీళ్ళు పెట్టడానికి వెళ్లాడు. పొలంకు సరిపడా నీళ్ళు సరిపోవడంతో బోరు మోటార్ వద్ద స్టాటర్ వద్దకు వెళ్లి స్విచ్ ఆఫ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడే కింద పడి మృతి చెందాడు. స్థానికులు గమ నించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేయగా మృతుడి చేతికి 3 వేళ్ళకు కరెంట్ తగలడం వల్ల కమ్లి గాయాలయ్యాయని తెలిపారు. మృతుడి భార్య పూజారి లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలి పారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసు పత్రికి తరలించడం జరిగిందని ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు.

అనధికార క్రమబద్ధీకరణ సరైంది కాదు

కామారెడ్డిటౌన్, జూన్ 30: ఏ ఒక్క ప్రభుత్వ పాఠ శాల మూతబడనీ యమని, మూసేసినవాటిని కూడా తెరిపి స్తామనిసీఎం రేవంత్ రెడ్డి ప్రకట నకు భిన్నంగా రాష్ట్రవిద్యా శాఖాధికారులు వ్యవహరిస్తున్నారని టీపీ టీఎఫ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం జరుగు తున్న ఎస్‌జీటీ బదిలీల్లో విద్యా ర్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో చాలా పాఠశా లల్లో ఖాళీ లు చూపించడం లేదని, దీనికంటే ముందు జరిపిన పదోన్నతుల్లో కూడా విద్యా ర్థులు సంఖ్య తక్కు వగా ఉందనే నెపంతో పోస్టులను నింప లేదని అన్నా రు. ప్రభుత్వం దొంగచాటుగా రేషనలైజేషన్‌కు పాల్పడు తుం దని సీఎం మాటలు ప్రచా రానికి, ప్రకటనల వరకే పరిమితం తప్ప ఆచర ణలో అమలుకావడం లేదని అన్నారు.గతంలో ప్రత్యేక నిబంధ నలు రూపొ ందించి ఉపాధ్యాయసంఘాలతో చర్చించి, కనీసం సమాచారం ఇచ్చి రేషన లైజే షన్ చేసేవారని ప్రస్తు తం బదిలీల్లో ఆయా ఖాళీలు చూపించ కుండా రేషనలై జేషన్ చేస్తు న్నారని తెలిపారు. టీచర్ పోస్టుల అనధికారిక క్రమ బద్ధి కరణకు టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని తెలి పారు. అన్ని ఖాళీలను చూపించ,బదిలీల అనంతరం మిగిలిన వాటిని ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యేదెన్నడో?

● శంకుస్థాపనకే పరిమితమైన శిలాఫలకాలు ● ఇళ్లముందు భారీ తవ్వకాలు ● ప్రజల అవస్థలపై పట్టించుకోని అధికారులు,ప్రజాప్రతినిధులు



మూడునెలల క్రిందట వేసిన శిలాఫలకం



భారీ గుంత తీసిన దృశ్యం

బిచ్కుంద, జూన్ 30:బిచ్కుంద పట్టణ అభి వృద్ధిలో భాగంగా సెంట్రల్‌లైటింగ్, నాలుగు వరు సల రోడ్ల పనుల కోసం తవ్వకాలు జరిపి ఏడాది కావ స్తున్న పనుల్లోమాత్రం పురోగతి కనిపించడం లేదు. గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేలు సెంట్రల్ లైటింగ్ పను లకు శంకుస్థాపన చేశారు. తర్వాత సాదర్ చెరువు అలుగు నుంచి గుర్రంవద్ద రోడ్డు ఇరుపక్కలా ని వాసపు ఇళ్ల,దుకాణసముదాయాల ముందు ఐదు ఫీట్లు లోతుతో తవ్వకాలు జరిపి వదిలేశారు. భారీ గా తవ్వకాలు జరపడంతో వ్యాపారాలు, ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.భారీ గో తు లతో చిన్నవ్యాపారుల వద్దకు ప్రజలు వచ్చేం దుకు జంకుతుండడంతో వ్యాపారులు తీవ్రనష్టాన్ని ఎదు ర్కొంటున్నామని వాపోతున్నారు.గతంలోపనులు చే పట్టినకాంట్రాక్టర్ టెండర్ వదిలివేశారు.ప్రస్తు తం అధికారంలో ఉన్నఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు సైతం గత మార్చినెలలో ఎస్‌ఎస్‌డీఎఫ్ నిధులు రూ.12 కోట్లతో రెండోసారి శంకుస్థాపన చేసిన పనులు మాత్రం ముందుకు కదలడంలేదు.కేవలం ప్రారం భోత్సవాలకు పరిమితమైన పనులు మాత్రం కాక పోవడంతో ప్రజలు తీవ్రఆగ్రహంవ్యక్తం చేస్తున్నా రు.ఇప్పటికైనా అధికారులు,స్థానిక ప్రజా ప్రతి నిధులు దృష్టిసారించి సెంట్రల్‌లైటింగ్ పను లు త్వరగాపూర్తయ్యేలా తీసుకోవాలని కోరుతున్నారు.



గత ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం

ఏళ్లు గడుస్తున్నా పేదలకు గూడు దొరికేనా ?



గత ప్రభుత్వ హయాంలో మంజూరై నిలిచిపోయి ఇంటి నిర్మాణం

మద్నూర్, జూన్ 30: గత ప్రభుత్వ హయాం లో పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తా మని ఘనంగా ప్రారంభించి నిధులు లేక అసం పూర్తిగా వదిలేసిన ఇండ్ల పథకం ఆగమ్య గోచరంగా మారింది. ప్రభుత్వం మారడంతో గతం లో ప్రారంభించి వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తి చేస్తారా లేక వదిలేస్తారా అన్నది ప్రభుత్వ నిర్ణయం పై ఆధారపడి ఉంది. గతంలో కేసీఆర్ పాలనలో ఇందిరమ్మ ఇండ్లకు ప్రత్యామ్నా యంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ప్రారంభించారు. గడిచిన పదేళ్లలో మండలంలో కేవలం 238 ఇండ్లు మాత్రమే మంజూరయ్యా యి.వాటిలో కొన్ని ఇండ్లు పూర్తి కాగా మరికొన్ని ఇళ్లు అసంపూర్తిగా ఆగిపోయాయి. కేసీ ఆర్ ప్రభు త్వం ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఉమ్మడి మ ద్నూర్ మండలానికి 238 ఇండ్లు మా త్రమే మం జూరు చేశారు. ఆ మంజూరై ఇండ్లు పు నాదుల స్థాయిలో కొన్ని పిల్లర్ల స్థాయిలో కొన్ని స్లా బ్‌ల స్థాయిలో నిలిచిపోయాయి అవి పూర్తి చేయాలంటే మళ్లీ అదేస్థాయిలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన ఈ ఇళ్లకు నిధులు వస్తాయాలేవా? అనిలబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరిట ఇవ్వ నున్న నిధులు అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణా నికి ఇవ్వాలని లబ్ధిదారులు కోరు తున్నారు.

రైతు భరోసా పథకం అమలుతీరుపై చర్చ



సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న రైతులు



రైతుబంధుపై చర్చ జరుపుతున్న దృశ్యం

బీబీపేట, జూన్ 30:బీబీపేట ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం ఆధ్వ ర్యంలో రైతుభరోసా పథకంఅమలుతీరుపై ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని ఆది వారం ఎస్‌ఆర్‌ఎం గార్డెన్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేసే రైతుభరోసా పథకంలో ఎకరానికి రూ.15 వేల నుండి 30 వేలకు పెంచాలని కోరారు.10ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతుభరోసా అమలు చేయాలని తెలిపారు. అలాగే ఐటీరిటర్న్ ఫైల్‌చేసే రైతులకు కూడా రైతుభరోసా పథకం వర్తింపజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెంకటశ్వర్ రెడ్డి,పీఏసీఎస్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఏవో పవన్‌కుమార్,పీఏసీఎస్ డైరెక్టర్‌లు ఆముదాలనరేందర్, మల్లేషం,దేవునిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు, జూన్ 30: ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా 10ఎకరాలలోపు వ్యవసాయభూమి ఉన్న ప్రతిరైతుకు రైతు భరోస కల్పించాలని భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి విండో పరిధిలోని రైతులు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ఆదివారం రైతుభరోస కార్యక్రమంలో విండో ప్రత్యేక మహాజన సభ కార్యక్రమాన్ని విండో చైర్మన్ రాజాగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ మాట్లాడుతూ విండో డైరెక్టర్లు, విండో పరిధిలోని అందరు రైతుల సహకారంతో విండోను అన్ని విధాలుగా అభివృద్ధి చేయ్యడం జరుగుతుందన్నారు. అనంతరం రైతుభరోస పట్టా భూమితో పాటుగా అసైండ్ భూ ములకు కల్పించాలని రైతులు తీర్మాణించారు. ఈ మేరకు ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిని విండో పాలక వర్గం సభ్యుల సన్మానించారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షుడు విఠల్, ఏవో రాధ, విండో సీఈవో మోహన్‌గౌడ్, విండో డైరెక్టర్లు, విండో పరిధిలోని రైతులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● రైతుబంధుపై చర్చ

గాంధారి: గాంధారి మండల సింగిల్‌విండో కార్యాలయంలో ఆదివారం ప్రభు త్వం అందించే రైతుబంధుపై,విధివిధానాలపై రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. వానకాలంలో,యాసంగిలో రైతులకు ఇచ్చే రైతుబంధు ఏ విధంగా రూపకల్పనచేస్తే బాగుంటనేదానిపై ప్రభుత్వం ఈ సమావేశాన్ని నిర్వహించారు. దీంతో రైతులు వారివారి అభిప్రాయాలను విధివిధానాలను తెలిపారు.ఈ కార్య క్రమంలో డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్, సింగిల్‌విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్ సంజీవ్, ముకుందరావు, గణపతి, సాయిలు,లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ సదాశివరెడ్డి

రైతులందరికి సమన్యాయం జరిగేలా చూడాలి

సదాశివనగర్, జూన్ 30:ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా పథకం అమలులో రైతులందరికి సమన్యాయం జరిగేవిధంగా చూడాలని సింగిల్‌విండో చైర్మన్‌లు ప్రభాకర్‌రావు, కమలాకర్‌రావు,సదాశివనగర్,గంగాధర్‌లు తెలిపారు. రైతుభరోసా పథకం అమలుకోసం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి,ఉత్తునూర్, పద్మాజీవాడి, సదాశివనగర్ సహకారసంఘాలలో డీఏఓ భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో రైతుల అభి ప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు తమతమ భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేశారు. అధికశాతం 10 ఎకరాల సాగుభూమికి మా త్రమే రైతుభరోసా అందజేయాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశా రు.కొంతమంది 15ఎకరాల వరకుమధ్యతరగతి ఉద్యోగులకు ఇన్కమ్‌ట్యాక్స్ చెల్లిం చే చిన్న రైతులకు కూడాఎలాంటి షరతులు లేకుండా రైతుభరోసా అంద జేయా లని అన్నారు.ఈకార్యక్రమంలో సీఈవోలు దేవేందర్‌రావు, నయిమ్, విగ్నే ష్ గౌడ్, భైరయ్య, మార్కెటింగ్ అధికారినగేష్,రామారెడ్డి ఎంపీపీదశరథ్‌రెడ్డి, సదా శివనగర్ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి,సహకారసంఘాల డైరెక్టర్‌లు,రైతులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతుడు నవీన్‌రెడ్డి



మృతుడి వివరాలను తెలుసుకుంటున్న ఎస్సై

నసురుల్లాబాద్, జూన్ 30: మండలం కంశెట్ పల్లి గ్రామ సమీపంలోని బోధన్- బాన్సువాడ ర హదారిపై, బోధన్ మండ లం రాంపూర్ గ్రామా నికి చెందిన పోతాడు నవీ న్‌రెడ్డి (40) రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెం దాడు.స్థానికుల సమాచారం తెలుసుకున్న నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య సంఘటన స్థలానికి చేరుకుని ప్రమా దానికి గలకారణాలు స్థానికుల కు మృతుడి కు టుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. అనం తరం మోతాడు నవీన్‌రెడ్డి అతి వేగంతో మో టార్ సైకిల్ నడుపుతూ అదుపు తప్పి అక్క డిక క్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలి పారు. మృతు డికి భార్య పోతాడు లాస్యఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై లావణ్య తెలిపారు.

భిక్కనూరు 44వ జాతీయరహదారిపై
పోలీసుల ప్రత్యేక బందోబస్తు



భిక్కనూరులో బందోబస్తు నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 30: నిజామాబాద్‌లో జరిగే మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ధర్మపురి శ్రీనివాస్ అం త్యక్రియల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పా టుగా మంత్రులు, ఆయానియోజక వర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు హాజరవుతున్న నే పథ్యంలో భిక్కనూరు మండలంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.ఈమేరకుభిక్కనూరు సీఐసంపత్ కుమార్ మాట్లాడుతూ భిక్కనూరుతో పాటుగా సర్కిల్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్ల సిబ్బందితో జిల్లా ముఖద్వారం బ స్వాపూర్ నుంచి మండలపరిది ముగింపు వరకు ప్రత్యేక బందోబస్తు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తో పాటుగా ఆయా పోలీసుస్టేషన్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్ అంత్యక్రియల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 30: నిజామాబాద్ జిల్లా కేంద్రం లో జరిగిన ధర్మపురి శ్రీనివాస్ అంత్యక్రియల్లో పాల్గొనేం దుకు భిక్కనూరు మండల కాంగ్రెస్ నాయకులు ఆది వారం పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా డీఎస్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించా రు.ఆయన అంత్యక్రియల్లో పాల్గొని డీఎస్‌తోఉన్న అను బంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈకార్యక్రమంలో మం డల కాంగ్రెస్ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాల అందజేత



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కామారెడ్డిటౌన్, జూన్ 30:యాదవ ఉద్యోగసొసైటి ఆ ధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం యాదవ విద్యార్థులకు ప్రతిభపురస్కారాలను అందించారు.ఈ సందర్భంగా పదో తరగతిలో 9 జీపీఏ, ఇంటర్‌లో 900లకు పైగా మార్కు లు సాధించిన విద్యార్థులను అభినందించినట్లు సొసైటి సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉదయ్ కుమార్, రాహుల్,సాయన్న,శ్రీనివాస్,ప్రభాకర్,భూమే ష్, క్రిష్ణ, కిష్టయ్య,శివరాజ్,రాములు పాల్గొన్నారు.

బాన్సువాడలో కురిసిన వర్షం

బాన్సువాడటౌన్, జూన్ 30: బాన్సువాడ పట్టణంలో ఆదివారం సాయంత్రం నుంచి ఓ మోస్తారుగా వర్షం కురిసింది. పంటపొలాల్లో నాటు వేసే సమయంలో వ ర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం సైతం చల్లబడడంతో ప్రజల కు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందినట్లైంది.

మార్చురీ ఫ్రీజర్ బాక్సు అందజేత

బీర్కూర్, జూన్ 30: బీర్కూర్ గ్రామ పంచాయితీ పరిధిలోని వెంకటప్పయ్య క్యాంపుకు చెందిన మన్నం కిషోర్‌బాబు అనే వ్యక్తి తన తండ్రి ప్రభాకర్ రావు జ్ఞాప కార్థం మార్చురీ ఫ్రీజర్ బాక్సును లయన్స్ క్లబ్‌కు అంద జేశారు. రూ.75 వేలు ఖర్చు చేసి బాక్సును తయారు చేయించినట్లు కిషోర్ తెలిపారు.ఈకార్యక్రమంలో బీర్కూ ర్ లయన్స్ క్లబ్ సభ్యులు విఠల్, సంతోష్, గాల య్య, రమేష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	- ఓసీ
దర్శన్	- కల్కి
ప్రియా 70	- కల్కి

బాన్సువాడ	
మహేశ్వరి	- కల్కి
వెంకటేశ్వర	- మహారాజ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

